క్లుప్తంగా

రోడ్ల మరమ్మతుకు చర్యలు



కోతకు గురైన మట్టి రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

ఐరాల: మండలంలో వర్షాలకు కోతకు గురైన మట్టి రోడ్ల మరమ్మతుకు వెంటనే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుండ్లపల్లె పంచాయతీలోని అక్కంచెరువుపల్లె, ఉప్పరపల్లె వంకను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వంకలో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. దీంతో వెంకటాపురం, వెంకటాపురం దళితవాడకు వెళ్లే మట్టి రోడ్డు కోతకు గురికావడంతో ప్రజల రాకపోకలు స్తంభించాయన్నారు. వెంటనే ఇసుక బస్తాలు వేసి, మట్టి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి కళ్యాణికి సూచించారు.కార్యక్రమంలో పీఆర్ ఏఈ ఉమామహేశ్వర్, డిప్యూటీ ఎంపీడీఓ డిల్లిబాబు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



వైద్య బృందంతో కోఆర్డినేటర్

యాదమరి: స్వస్త్ నారీ ససక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ఆయన మండలంలోని కోణాపల్లిలో జరిగిన ఈ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి డా.అనిల్‌కుమార్ నాయక్‌తో కలసి పరిశీలించారు. అనంతరం మహిళలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. అనంతరం కార్యక్రమం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.3,70,800 ఆదాయం

గుడిపాల: మోటార్ సైకిళ్ల వేలం పాటలో రూ.3,70,800 ఆదాయం వచ్చినట్లు డీఎస్పీ సాయినాథ్ తెలిపారు. గురువారం గుడిపాల పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసులకు సంబంధించి 37 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లను వేలం వేశామని, ఇందులో రూ.3,70,800 వచ్చిందన్నారు. ఇందుకు జీఎస్టీ అదనంగా వసూలు చేయడం జరుగుతుందన్నారు. సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ రామమోహన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత నాగరాజన్

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ అన్నారు. యూనియన్ కమిటీ సమావేశం గురువారం చిత్తూరులోని ఎస్‌టీయూ కార్యాలయంలో నిర్వహించారు. నాగరాజన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమ ప్రధానమన్నారు. అయితే ఇక్కడి కార్మికులకు సబ్బులు, నూనె, పాదరక్షలు ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వకుండా కార్పొరేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలకు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వాసు, వినాయక, జయశంకర్, గోపినాథ్, లోకనాథం, రంజిత్, కస్తూరి, సుకన్య, భాగ్యలక్ష్మి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

1,191 పశువులకు టీకాలు



దిగువమోదలపల్లెలో పశువులకు టీకాలు వేస్తున్న గోపాలమిత్రలు

తవణంపల్లె: మండలంలో 1,191 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ లావణ్య తెలిపారు. గురువారం మండలంలోని దిగువమోదలపల్లె, ఎగువ మోదలపల్లె, ఎగువ కారకాంపల్లె, సంతపల్లె, ద్వారకాపురం, పెద్దపల్లం, సత్తార్‌బావి, లక్ష్మీపురం, ఎ.గొల్లపల్లె, గోవిందరెడ్డిపల్లె, అత్తిమాకులపల్లె, జి.గొల్లపల్లె గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించినట్లు పేర్కొన్నారు. మండలంలోని జేఈఓ వాణి, ఏహెచ్ఏలు హరి, చందనారెడ్డి, జస్వబాల్, రాజేంద్రప్రసాద్, చరణ్‌తేజ, గోపాలమిత్రలు తులసీపతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు. శుక్రవారం జెట్టిపల్లె, ఎగువమారేడుపల్లె, తోటరాగనిపల్లె, చిగరాకులపల్లె, పొన్నేడుపల్లె, ఎ.గొల్లపల్లె, గోవిందరెడ్డిపల్లె, కృష్ణాపురం, జి.గొల్లపల్లె హెచ్‌డబ్ల్యూ గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు.

బాబు మోసాలను వివరిద్దాం



గుడిపాల: క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడిపాల: కూటమి ప్రభుత్వ అరాచకాలు, మోసాలను ప్రజలకు వివరిద్దామని వైఎస్సార్ సీపీ గుడిపాల మండల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం గుడిపాల మండలంలోని వసంతాపురం, గుడిపాలలో సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో తప్పుడు హామీలిచ్చి ప్రజలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై చంద్రబాబు నోరు మెదపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి, ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి పంట ఫ్యాక్టరీలకు తరలించిన రైతులకు ఇప్పటివరకు డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు.

ఉచిత బస్సు ఎక్కడ

గుడిపాల మండలంలో ఉచిత బస్సు ఊసే కనిపించడం లేదని వైఎస్సార్ సీపీ నేతలు ఆరోపించారు. ప్రతి మహిళకు అన్ని బస్సుల్లో ఉచితం అని చెప్పి గుడిపాల మండలంలో కేవలం మూడు బస్సుల్లో మాత్రమే ఉచితం కల్పించారన్నారు. మిగిలిన బస్సులన్నీ అంతరాష్ట్ర సర్వీసులంటూ ఉచితాన్ని ఎగ్గొట్టారని, దీనిపై మహిళందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు రూ.1500 చొప్పున అందజేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

మోసం.. చంద్రబాబు నైజం

ఎన్నికల సమయంలో అలవిగాని హామీలిచ్చి సీఎం చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, మోసం చేయడమే ఆయన నైజం అన్నారు. ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రతి కుటుంబం ఎంత నష్టపోతుందో ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ– భవిష్యత్ గ్యారెంటీ అని బాండ్లు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు భృతి ఇస్తామని, ఆడబిడ్డ నిధి వంటి పథకాలు ఇస్తామని ప్రగల్భాలు పలికి, నేడు ఇవ్వలేదన్నారు. పొదుపు మహిళకు రూ.10 లక్షలు బ్యాంక్ లోన్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రాయల్, జనార్దన్, రెడ్డెప్ప, గోపి, మోహన్, సామ్యూవేల్, చిట్టిబాబు, వెంకటేష్ రెడ్డి, పెరిల్లా, నవీన్, ప్రకాష్, అజిత్, కృష్ణమూర్తి, సైమాన్, రామకృష్ణారెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇంత దుర్మార్గపు పాలన ఎక్కడైనా ఉందా.. బాబూ?



సమావేశం అనంతరం పార్టీ నాయకులు

పూతలపట్టు(యాదమరి): దేశ చరిత్రలో ఇంత దుర్మార్గపు పాలన ఎక్కడా లేదని, దౌర్భాగ్యం కూటమి ప్రభుత్వ రూపంలో దాపురించిందని తలపులపల్లి బాబురెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పి.కొత్తకోటలో ఉన్న ఓ కల్యాణ మండపంలో మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ పూతలపట్టు మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తలపులపల్లి బాబురెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలతో ప్రజలను వంచించి గద్దెనెక్కారన్నారు. సూపర్‌సిక్స్ సూపర్ సక్సెస్ అని వారు చెప్పుకుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. మీరిచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటైనా ఆంక్షలు, కోతలు లేకుండా అమలు చేశారా బాబూ? అని ప్రశ్నించారు. మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పిన చంద్రబాబు, తాను ఎప్పుడూ చెప్పే ఆ వేంకటేశ్వరుని నిలయమైన తిరుమలకు వెళ్లే మహిళలకు ఉచిత బస్సులపై ఆంక్షలు విధించడం ఆయన రెండు నాలుకల ధోరణికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవకి, వైస్ ఎంపీపీలు ద్వారకనాథ్‌రెడ్డి, మురళీకృష్ణ, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వెంకటరమణ, యువజన విభాగం మండల అధ్యక్షులు నవీన్, సర్పంచ్ మణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ లింకేజీ రుణాలతో ఆర్థికాభివృద్ధి



చెక్కు అందజేస్తున్న యూకో బ్యాంక్ విజయవాడ జోనల్ మేనేజర్ శరవణన్ సుబ్రమణ్యం

ఐరాల: గ్రామైక్య సంఘాల్లోని డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని యూకో బ్యాంక్ విజయవాడ జోనల్ మేనేజర్ శరవణన్ సుబ్రమణ్యం అన్నారు. గురువారం స్థానిక యూకో బ్యాంక్‌లో బ్రాంచ్ మేనేజర్ భానుచందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌హెచ్‌జీ రుణ మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. యూకో బ్యాంక్ డ్వాక్రా సంఘాల బలోపేతం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. లింకేజీ రుణాలను తప్పనిసరిగా జీవనోపాధి కార్యకలాపాలకు ఉపయోగించాలని సూచించారు. భానుచందర్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా యూకో బ్యాంక్ ప్రోత్సాహిస్తోందని చెప్పారు. అనంతరం మండలంలోని 6 స్వయం సంఘాలకు రూ.1.04 కోట్ల విలువైన బ్యాంక్ లింకేజీ రుణాల నమూనా చెక్కును ఏపీఎం రవితో కలిసి మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తేజ, మౌనవి, దీక్షతి, భానుప్రకాష్‌రెడ్డి, హయత్‌బాషా, జవహర్, జయరామాచారి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు తక్షణమే ఉత్తర్వులు ఇవ్వండి

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు తక్షణమే నియామక ఉత్తర్వులను ఇవ్వాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు కోర్టు తీర్పునకు లోబడి షరతులతో తక్షణమే నియామక ఉత్తర్వులను జారీ చేయాలన్నారు. పారదర్శకంగా డీఎస్సీ అభ్యర్థులకు ఎంపిక చేశామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ప్రమాణ పత్రాలంటూ కాలయాపన చేయడం సబబు కాదన్నారు. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. డీఎస్సీ రూల్స్‌లో ఎన్నడూ లేని విధంగా సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. దీంతో బాధిత డీఎస్సీ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. నిబంధనల రూపకల్పనలో రాష్ట్ర విద్యాశాఖ అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇప్పటికే అభ్యర్థులు విసిగి పోయారన్నారు. అవసరమున్న పాఠశాలల్లో ఖాళీలను వెంటనే ప్రకటించి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దసరా సెలవుల్లో ఎంపికైన అభ్యర్థులకు మెరుగైన వసతులతో నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు.

డీఏ బకాయిలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన నాలుగు డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని విద్యుత్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. వారు మాట్లాడుతూ ఈపీఎఫ్, జీపీఎఫ్ అమలు చేసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. సీనియారిటీ కలిగిన ఉద్యోగులను శాశ్వతంగా తీసుకోవాలన్నారు. పలు విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, యజ్ఞేశ్వరరావు, వివేకానందరెడ్డి, చంద్రమౌళి, రాజేంద్రబాబు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో నూతన డీఎఫ్ఓ భేటీ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న నూతన డీఎఫ్ఓ

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా నియమితులైన జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) సుబ్బ రాజు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనంతరం జిల్లాలో అటవీ శాఖలో నెలకొన్న సమస్యలు, అటవీ శాఖ అభివృద్ధికి చేపట్టాల్సిన పలు అంశాలను నూతన డీఎఫ్ఓకు కలెక్టర్ సూచించారు. ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలను కలెక్టర్ వెల్లడించారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



తుంబకుప్పంలో పిల్లలకు అన్నప్రాస చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వినుతశ్రీ అన్నారు. గురువారం మండలంలోని తుంబకుప్పం జెడ్పీ హైస్కూలులో కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు ఊబకాయం రాకుండా చూసుకోవాలని సూచించారు.ఊబకాయం వస్తే శరీరంలో అధికంగా కొవ్వు పేరుకుపోయి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. అధిక కొవ్వు, చక్కర ఉన్న ఆహారం తినడం, శారీరక శ్రమ లేకపోవడంతో ఊబకాయం వస్తుందన్నారు. మంచి పోషకాలు కలిగిన ఆహారం, వ్యాయామంతో ఊబకాయం దూరం అవుతుందని తెలిపారు. అనంతరం కిశోర బాలికలకు ఊబకాయ పరీక్షలు చేశారు. తరువాత గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, సీహెచ్ఓ నాగవేణి, ఏఎన్ఎం నీరజ, జీఎంఎస్‌కే శ్రవంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫామిదాబేగం పాల్గొన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణపై అవగాహన

చిత్తూరు అర్బన్: ఘన వ్యర్థాల నిర్వహణపై వార్డు కార్యదర్శులు అవగాహన పెంచుకోవాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో వార్డు పర్యావరణ, పారిశుద్ధ్య కార్యదర్శులు, అమినిటీ కార్యదర్శులకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. సహాయ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్, ఘన వ్యర్థాలను రోడ్లపై గుంతలు పూడ్చటానికి, ఇతర ప్రదేశాల్లో ఉపయోగించవచ్చన్నారు. దీనిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు.

ఆరోగ్య శిబిరం పరిశీలన

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లెలో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ సందర్శించారు. వైద్యాధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. ఆరోగ్య శిబిరంలో రోగులకు ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలును ఆరా తీశారు. పల్లెల్లోని ప్రజలకు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ తదితర పరీక్షలు చేయించాలని సూచించారు. వయోవృద్ధులకు పరీక్షలు చేయించాలని ఆదేశించారు. మానసిక వైద్య సేవలు చేయించాలని సూచించారు. ఆరోగ్య శిబిరం నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

కుంట కాదు.. రోడ్డు



మొగిలివెంకటగిరి ఫ్లైఓవర్ వద్ద సర్వీసు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బంగారుపాళెం: కుంటను తలపిస్తున్న ఈ రోడ్డు మొగిలి వెంకటగిరి ఫ్లైఓవర్ వద్ద ఉన్న సర్వీసు రోడ్డు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సర్వీసు రోడ్డుపై నీళ్లు నిలిచిపోయాయి. ఈ సర్వీసు రోడ్డు మీదుగా పాలేరు, మోతకుంట, శేషాపురం, పాలమాకులపల్లె గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నీరు వెళ్లే మార్గాలను ఆక్రమణదారులు మూసివేయడంతో నీరు సర్వీసు రోడ్డుపై ఇలా కుంటలా దర్శనమిస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. హైవే అధికారులు స్పందించి సర్వీసు రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

యాదమరి: యానాదులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎంపీడీఓ పెంచల రవీంద్ర అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఓటేరుపల్లి యానాది కాలనీలో సర్పంచ్ భగవతితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడున్న కాలనీవాసులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుసార్లు విన్నవించినా స్పందించలేదని వాపోయారు. దశాబ్దాల క్రితం నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరాయన్నారు. వర్షం వస్తే చంటి బిడ్డలతో ప్రాథమిక పాఠశాలలో తలదాల్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు నూతన గృహాలు మంజూరు చేయాలని కోరారు. సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓకు విన్నవించారు. స్పందించిన ఆయన ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శైలజ, వీఆర్వోలు శ్రీనాథ్, రూపావతి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు సద్వినియోగం చేసుకోండి



రవికుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రవికుమార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గ్రామ సచివాలయాల ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన సేవలందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే కచ్చితంగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోని కారణంతో పలువురు అనర్హులవుతున్నారని తెలిపారు. కొంతమంది తల్లికి వందనం పథకం పొందలేకపోయారన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సచివాలయ సిబ్బంది ఈకేవైసీ చేయిస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు చేయిస్తున్నామన్నారు. డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఈకేవైసీ చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 23వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జిల్లాలో ఆధార్ నమోదు, బయోమెట్రిక్ కొనసాగింపునకు ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాణిపాకం ఆలయ చైర్మన్‌గా మణినాయుడు



మణినాయుడు

కాణిపాకం: ఎట్టకేలకు కాణిపాకం ఆలయ చైర్మన్‌గా మణినాయుడు నియమితులయ్యారు. వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం చైర్మన్ కుర్చీపై ఉత్కంఠ వీడింది. ఏడాదిన్నరగా చైర్మన్ కుర్చీ కోసం కూటమి నేతలు పలువురు గట్టిగా పోటీ పడ్డారు. నువ్వా.. నేనా అంటూ పోటీపడుతూ వచ్చారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఆ కుర్చీని మాజీ చైర్మన్‌కే కట్టబెట్టింది. గురువారం దేవస్థాన చైర్మన్‌గా మణినాయుడు అధిష్ఠానం ప్రకటించింది. దీంతో మణినాయుడు వర్గం సంతోషం వ్యక్తం చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పటి వరకు చైర్మన్‌గా ఉన్న మోహన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ పదవికి పలువురు గట్టిగా పోటీ పడుతూ వచ్చారు. అయితే మాజీ చైర్మన్ మణినాయుడు మళ్లీ ఆ పదవి తనకే కావాలని తొలి నుంచి పట్టు పడుతూ వచ్చారు. ప్రజాప్రతినిధులు సైతం ఆయనకే మద్దతు పలుకుతూ వచ్చారు. కానీ మణినాయుడికి రాకూడదని ఆ పార్టీలోని పలువురు మాజీకి తప్ప మిగిలిన వారికి ఎవరికైనా ఇవ్వండంటూ చెబుతూ వచ్చారు. మంత్రులు, బడానేతలను కలిసి చైర్మన్ పదవి తమకు కావాలని పలువురు పట్టుబట్టారు. అయితే ఎట్టకేలకు మణినాయుడినే చైర్మన్ పదవి వరించింది. దీంతో ఆశావాహులు భంగపడ్డారు.

ఆరోగ్య రక్షణ అవసరం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహిళలకు ఆరోగ్య రక్షణ అవసరమని బీఎస్ఆర్‌పేట పీహెచ్‌సీ వైద్యులు ఆర్ శ్రీదేవి, కార్తీక్ పేర్కొన్నారు. చిత్తూరు మండలంలోని బీఎస్ఆర్‌పేట పీహెచ్‌సీలో గురువారం స్వస్త్ నారీ ససక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. స్పెషలిస్టు డాక్టర్లతో వైద్య పరీక్షలు చేశారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. పౌష్టికాహారంపై తల్లులకు వివరించారు. కార్యక్రమంలో బీఎస్ఆర్‌పేట సర్పంచ్ త్యాగరాజులు, తదితరులు పాల్గొన్నారు.

జోరువాన



జలమయమైన మిట్టూరు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో గురువారం జోరువాన కురిసింది. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం గంట పాటు కురిసింది. ఈ వర్షానికి పలు ప్రాంతాలు నీటి కుంటలను తలపించాయి. రోడ్డంతా జలమయమైంది. కాలువల్లో నీళ్లు దొర్లాయి. దీంతో పల్లెల్లోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

కనువిందు చేసిన ఇంద్రధనస్సు



చిత్తూరు కలెక్టరేట్ : నగర సరిహద్దులో సుందరరాజపురం వద్ద ఇంద్రధనస్సు కనువిందు చేసింది. గురువారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో చిత్తూరు నుంచి గంగాధరనెల్లూరు వెళ్లే దారిలో ఉండే సుందరరాజపురం వద్ద ఆకాశంలో ఇంద్రధనస్సు ప్రత్యక్షమైంది. ఓ వైపు ఎండ మరోవైపు చిన్నపాటి చినుకులతో ఇంద్రధనస్సు చూపరులను ఆకట్టుకుంది.

దివ్యాంగ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు రేపు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లె ఉన్నత పాఠశాలలో ఈ నెల 20వ తేదీన శనివారం పూతలపట్టు నియోజకవర్గంలోని దివ్యాంగుల(సీడబ్ల్యూఎస్ఎన్) విద్యార్థులకు మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహిస్తామని తవణంపల్లె ఎంఈఓలు హేమలత, మోహన్‌రెడ్డి తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లె, బంగారుపాళెం, ఐరాల, యాదమరి, పూతలపట్టు మండలాల్లోని దివ్యాంగుల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తామన్నారు. నడవలేని పిల్లలు, వినికిడి లోపం, చూపులేని పిల్లలు, బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలకు పరీక్షలు చేయిస్తామన్నారు. 6–18 ఏళ్లలోపు దివ్యాంగుల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తామన్నారు. దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పిల్లల పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు, యూడీఐడీ కార్డు, స్టూడెంట్ ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు తీసుకుని వైద్య శిబిరానికి హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు సహిత విద్య ఉపాధ్యాయులు దేవేంద్ర 9908801305, దిలీఫ్ 9704683867 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.